# పోడు పట్టాలతో గిరిజనుల్లో వెలుగులు

- చిత్తశుద్ధితో పంపిణీ చేస్తున్న సీఎం కేసీఆర్
- 75 ఏండ్లలో 3 లక్షల ఎకరాలకు ఇస్తే.. తొమ్మిదేండ్లలో 4.60 లక్షల ఎకరాలకు బీఆర్ఎస్ పట్టాలిచ్చింది
- భూములను సాగుకు అనుకూలంగా మార్చేందుకు తోడ్పాటు
- అమలు కాని చట్టాలు తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వ విధానాలతోనే పట్టాల పంపిణీలో ఆలస్యం
- రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- మేడారంలో లబ్ధిదారులకు పోడు హక్కు పత్రాల పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

ములుగు(నమస్తేతెలంగాణ)/తాడ్వాయి, జూలై 3 : పోడు పట్టాలతో గిరిజన రైతుల్లో వెలుగులు నింపుతున్నట్లు రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సోమవారం సమ్మక్క-సారక్క తాడ్వాయి మండలం మేడారం గ్రామంలోని గిరిజన సంక్షేమ శాఖ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో కలెక్టర్ కృష్ణఆదిత్య అధ్యక్షతన ములుగు జిల్లాకు చెందిన పోడు భూముల సాగుదారులకు హక్కు పత్రాలు, జిల్లాలో ప్రభుత్వ నిషేధిత సంస్థల్లో పనిచేస్తూ లొంగిపోయిన కుటుంబాలకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథులుగా మంత్రి సత్యవతిరాథోడ్‌తో పాటు మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి, ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, ఐటీడీఏ పీవో అంకిత్ కలిసి 847మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం గణంక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన డిస్ట్రిక్ట్ హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ పోడు హక్కుల చట్టం ఏర్పాటు చేసిన నాటి నుండి ఇప్పటి వరకు గత ప్రభుత్వాలు మూడు లక్షల ఎకరాలకు పట్టాల పంపిణీ చేస్తే సీఎం కేసీఆర్ 9ఏళ్ల పరిపాలనలోనే ఒకే రోజు 4.60లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలను అందించారని అన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున చేపట్టిన పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చూస్తుంటే మేడారం మహా జాతరను తలపిస్తోందన్నారు. అర్హులైన ప్రతి సాగుదానికి హక్కు పత్రం అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయన్నారు. గిరిజన రైతులకు పోడు పట్టాలను అందించడంతో పాటు అర్హులైన గిరిజనేతర రైతులకు సైతం పట్టాలు ఇవ్వాలని ములుగు కలెక్టర్ కృష్ణ ఆదిత్య సూచించారన్నారు. సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో తీసుకున్న నిర్ణయాల కారణంగానే పట్టాల పంపిణీ జరుగుతోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని విధంగా ఒకే సమయంలో 1.50లక్షల కుటుంబాలకు 4.20లక్షల ఎకరాల భూములకు హక్కుపత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. పోడు రైతులకు హక్కు పత్రాలను అందించిన అనంతరం రైతు బంధు, రైతు బీమా పథకాన్ని వర్తింపచేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.406కోట్లను వెచ్చిస్తోందన్నారు. గిరిజన విద్యార్థుల నాణ్యమైన విద్యను అందించేందుకు తగిన వసతులను ఏర్పాటు చేయడంతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారనారు. గిరిజనులు ఏవైనా కారణాలతో పట్టాలు పొందకపోతే తగిన చర్యలు చేపట్టి హక్కు పత్రాలను అందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పోడు భూముల చట్టంలోని విధానాలతోనే హక్కు పత్రాలు అందించడంలో ఆలస్యం జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ చట్టంలో వెసులుబాటు కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఏదో ఒక విధంగా అర్హులైన పోడు సాగుదారులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. గిరిజనేతర రైతుల భూముల జోలికి అటవీశాఖ అధికారులు వస్తే ప్రభుత్వం తరపున అండగా ఉంటామని మంత్రి తెలిపారు. ఖమ్మం సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తాము పాలిస్తున్న రాష్ట్రాల్లో అమలు కాని పథకాలను తెలంగాణలో అమలు చేస్తానని హామీలు ఇచ్చారని, అమలు కాని చట్టాలు తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి అన్నారు. గత ప్రభుత్వాలు చేసిన చట్టాలతోనే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. కన్నతల్లికి అన్నం పెట్టకుండా వినటానికి బంగారు గాజులు చేయిస్తామని రీతిలో కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పాలిస్తున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నెలకు రూ.700 పెన్షన్ ఇస్తూ ఇక్కడ రూ.4000 ఇస్తామనడం నమ్మశక్యంగా లేదన్నారు. కేంద్రలోని బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ములుగులో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని మంత్రి అన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా ఐటీడీఏలను బలోపేతం చేసి, ఐఏఎస్ అధికారులు నియమించి గిరిజనులకు సేవలందిస్తున్నామన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకున్న నేత సీఎంగా ఉండడం రాష్ట్ర ప్రజల అదృష్టమని మంత్రి అన్నారు.

### రాజ్యాంగాన్ని అమలు చేసేది తెలంగాణే

రాజ్యాంగాన్ని దేశంలో అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మానుకోట మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. పోడు పట్టాల విషయంలో దశాబ్దాల కాలంగా గిరిజనుల నిరీక్షణకు నేటితో తెరపడిందన్నారు. అడవి బిడ్డలైన ప్రకృతి పూజారులకు హక్కులు కల్పించిన మహానేత సీఎం కేసీఆర్ అన్నారు. రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్ రెడ్డి మాట్లాడుతూ అడవి బిడ్డలు సాగు చేసుకుంటున్న భూములకు హక్కుపత్రాలను అందించేందుకు కృషి చేస్తూ అంతకు రెట్టింపు స్థాయిలో హరితహారం కార్యక్రమం ద్వారా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు సీఎం కేసీఆర్ కృషి చేశారన్నారు. ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పరిపాలనలో సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో వ్యవహరిస్తూ ప్రజల కష్టాలను తెలుసుకొని ప్రజలు అడగకపోయినా వారి అవసరాలను తీరుస్తున్నారన్నారు. బీడు బారిన భూములకు సాగునీళ్లు ఇచ్చి, ప్రస్తుతం పోడు భూములను కూడా సాగు భూములు మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఇలాత్రిపాఠి, డీఆర్వో రమాదేవి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్‌నాయక్, ఎంపీపీలు వాణిశ్రీ, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీదేవి, జడ్పీటీసీలు సకినాల భవాని, తుమ్మల హరిబాబు, పాయం రమణ, మేడారం సర్పంచ్ చిడెం బాబురావు, జడ్పీకోఆప్షన్ మెంబర్ వలియాబీ, ఓఎస్డీ అశోక్‌కుమార్, ఆదివాసీ సంఘాల నాయకులు మైపతి అరుణ్‌కుమార్, మడే సాయిబాబా, పీసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

### చాలా ఏండ్ల నాటి రంది తీరింది

చాలా ఏండ్ల సంది చాలా రంది అయింది. పోడు భూముల మీదికి పోతే అధికారులు వచ్చి లొల్లి చేసేది. పంట నష్టం కూడా చాలా మందికి జరిగేది. సీఎం కేసీఆర్ సారు మా కష్టాలను చూసి పట్టాలు అందించిండు. ఆయన సల్లగా ఉండాలే. గిరిజనులమైన మా గోస తీర్చిన మహానుభావుడు కేసీఆర్ సారు. ములుగు జిల్లాలో పట్టాల పంపిణీ కార్యక్రమంలో మొదటి పట్టా నేనే తీసుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు దర్జాగా ఇది నా భూమి. నాకు కేసీఆర్ సారు ఇచ్చిన పట్టా పుస్తకం ఉంది. సమ్మక్క-సారక్కలు సార్‌ను సల్లగ చూడాలే.

– అల్లం లక్ష్మి, బయ్యక్కపేట



మోటర్ల ద్వారా ఎత్తిపోస్తున్న నీరు

## కన్నేపల్లిలో ఎత్తిపోతలు షురూ

కాళేశ్వరం, జూలై 3 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరంలోని లక్ష్మీ(కన్నేపల్లి) పంపుహౌస్‌లో మోటర్ల ద్వారా నీరు ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఐదు మోటర్ల ద్వారా ఇంజినీర్లు సరస్వతీ(అన్నారం) బరాజ్‌కు 11000 క్యూసెక్కుల నీటిని తరలించారు. కన్నేపల్లి పంప్‌హౌస్‌లో 2,3,5,6, 7వ మోటర్లు నిరంతరంగా నడుస్తూ నీటిని డెలివరీ సిస్టర్న్ నుంచి గ్రావిటీ కెనాల్‌లో ఎత్తి పోస్తున్నాయి. పైపుల ద్వారా పోసిన నీరు గ్రావిటీ కెనాల్ ద్వారా సరస్వతీ బరాజ్‌కు తరలుతోంది.

## సమ్మక్క బరాజ్ వద్ద పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

కన్నాయిగూడెం, జూలై 3 : మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. సోమవారం ఎగువ నుంచి గోదావరి వరద 3175 క్యూసెక్కులు వస్తుండడంతో బరాజ్ వద్ద నీటిమట్టం 75 మీటర్లకు చేరుకున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. గత ఏడాది జూలై మొదటివారంలోనే భారీ వర్షాలకు గోదావరి ప్రమాద స్థాయిలో ప్రవహించింది. ఈ సంవత్సరం జూలై నెల మొదలైనా వర్షాలు పడకపోవడం, గోదావరిలో వరద తక్కువగా ఉండడంతో మూడు రోజులుగా బరాజ్ గేట్లను బంద్ చేసి నీటిని నిల్వ చేస్తున్నారు.




## లొంగిపోయిన నక్సలైట్లకు ఇంటి స్థలాల పంపిణీ



మాజీ నక్సలైట్ గంటమూరి భాగ్యలక్ష్మికి ఇంటి స్థలాల పత్రాలను అందిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్ తదితరులు

ములుగు, జూలై 3(నమస్తేతెలంగాణ) : ములుగు జిల్లాకు చెందిన లొంగిపోయిన మాజీ నక్సలైట్లకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాల పత్రాలను మంత్రి సత్యవతిరాథోడ్, జడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, ఓఎస్డీ అశోక్‌కుమార్‌తో కలిసి సోమవారం మేడారంలో అందజేశారు. ఈ సందర్భంగా ఓఎస్డీ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నిషేధిత సంస్థల్లో పనిచేస్తూ లొంగిపోయిన 38మంది మాజీ నక్సలైట్లకు ములుగు మండలం జగ్గన్నపేట శివారులో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి ఇంటి స్థలాల పట్టాలను అందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మామిడి తిరుపతమ్మ అలియాస్ సుగుణక్క, గొట్టెముక్కుల ఈశ్వరీ, గంటమూరి భాగ్యలక్ష్మి, మేడిపల్లి శ్రీనివాస్, పావురాల భిక్షపతి అలియాస్ సింగన్న, బైరబోయిన భిక్షపతి అలియాస్ కిరణ్, బానోతు షక్ర, బూతం రాఘవులు, దుగుని సమ్మయ్య, దుర్శెట్టి రవి, గుగులోతు శ్రీరాములు, కామ వెంకన్న, రత్న సంజీవ, తడుక రవీందర్, ఉడుత ఉప్పలయ్య, గుండేటి సదానందం, ఎండీ అలియోద్దీన్, ఆగబోయిన సాంబయ్య, అల్లెం బాలయ్య, కొప్పుల బతుకయ్య, లంజపల్లి లాలయ్య, పూరి స్వరూప, అల్లెం కోమల, బుర్రి సాంబయ్య, బుర్రి సతీశ్, చేల రామయ్య, కుక్కల గణపతి, నామాల దేవేందర్, కొండగొర్ల రవీంద్రబాబు, చల్ల భాస్కర్, కావిరి సమ్మయ్య, జనగాం మల్లీశ్వరీ, కావిరి రోశారావు, బొగ్గుల పెంటయ్య, గుండ్ల పాపారావు, పూణెం సాధన, యాలం వీరన్నకు గుంట(120 గజాలు) చొప్పున స్థలాలను మంజూరు చేసి హక్కు పత్రాలను అందించినట్లు వివరించారు.

